లోక్ అదాలత్‌తో కేసుల సత్వర పరిష్కారం

సంగారెడ్డి, సెప్టెంబర్ 24: కక్షిదారులు, న్యాయవాదులు, పోలీసు అధికారుల సమన్వయంతో రాజీతో కేసులు పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానిచంద్ర కోరారు. మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 28న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సివిల్, కుటుంబ తగాదాలు, క్రిమినల్, కాంపౌండబుల్ కేసులు, 138 ఎన్‌టీయాక్ట్ కేసులు, మోటార్ వాహన ప్రమాద నష్టపరిహార కేసులు, మెయింటనెన్స్ కేసులు, చిట్‌ఫండ్ కేసులు, ఆస్తి తగాదాలు, బ్యాంక్ రికవరీ, టెలిఫోన్ రికవరీ కేసులు, రెవెన్యూ, విద్యుత్ చౌర్యం, ప్రీలిటిగేషన్ కేసులు పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఆయా కేసులు అధిక సంఖ్యలో పరిష్కరించుకోవాలని కోరారు.

అభివృద్ధి పనులపై ఆడిట్

ఝరాసంగం, సెప్టెంబర్ 24 : మండల పరిధిలోని గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులపై ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం అధికారులు ఆడిట్ ప్రారంభించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పంచాయతీలు చేసిన ఖర్చులు వాటికి సంబంధించిన బిల్లులు, ఓచర్లును పరిశీలించారు. మండల పరిధిలో 33 గ్రామ పంచాయతీలుండగా మేదపల్లి, నర్సాపూర్, దేవరంపల్లి, గంగాపూర్, కప్పాడ్ గ్రామాలకు సంబంధించిన ఆడిట్ జరిగిందని ఆడిటర్ శంకర్ తెలిపారు. రోజూ ఐదు గ్రామాలకు సంబంధించి ఆడిట్ జరుగుతుందని పేర్కొన్నారు.

ధ్వంసమైన మొక్కజొన్న పంట పరిశీలన

గుమ్మడిదల, సెప్టెంబర్ 24: అడవి పందులు మొక్కజొన్న పంటలో స్వైర విహారం చేసి నష్టం చేశాయి. గుమ్మడిదల మండలంలోని పోతుగారి మోహన్‌రెడ్డికి చెందిన మొక్కజొన్న పంటను సోమవారం రాత్రి అడవి పందులు స్వైర విహారం చేయడంతో పంట పాక్షికంగా నష్టపోయింది. బాధిత రైతు మంగళవారం వ్యవసాయ అధికారులకు తెలియజేయడంతో మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రావు, ఏఈవో నిఖిత క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు.

అంతర్జాతీయ సదస్సుకు డాక్టర్ కృష్ణమూర్తి

సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 24: అంతర్జాతీయ న్యూరో సదస్సులో సంగారెడ్డిలోని హోప్ న్యూరో, కార్డియాక్ హాస్పిటల్ అధినేత, ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ కృష్ణమూర్తి పాల్గొననున్నారు. అమెరికాలోని హౌస్టన్‌లో ఈ నెల 28 నుంచి ఐదు రోజుల పాటు జరిగే కాంగ్రెస్ ఆఫ్ న్యూరోలాజికల్ సర్జన్స్ అసోసియేషన్ నిర్వహించే అంతర్జాతీయ సదస్సులో పాల్గొనేందుకు ఈ నెల 26న సంగారెడ్డి నుంచి బయలుదేరనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు రోజుల సదస్సులో చర్చకు వచ్చే అత్యాధునిక వైద్య విధానాలు, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగంపై అవగాహన పెంచుకొని జిల్లాలో మెరుగైన వైద్య సేవలు అందిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని వివిధ దవాఖానల యజమానులు, కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు శుభాకాంక్షలు తెలిపారు.

టార్గెట్ పూర్తి చేయాలి

ఝరాసంగం, సెప్టెంబర్ 24: ఇందిరా మహిళా శక్తి, మైక్రో ఎంటర్‌ప్రైజెస్ టార్గెట్ పూర్తి చేయాలని డీపీఎం జయశ్రీరాజ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రామీణ పేదరిక నిర్మూళన సంస్థ కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. సెప్టెంబర్ వరకు ఇచ్చిన టార్గెట్ మేరకు యూనిట్ల గ్రౌండింగ్ పూర్తిచేయాలన్నారు. పీఎంఎఫ్ఎంఈ కింద మంజూరైన యూనిట్ పత్రాన్ని లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎం బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

150 ఎంపీ స్థానాలివ్వాలి

సంగారెడ్డి, సెప్టెంబర్ 24: ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 150 ఎంపీ స్థానాలివ్వాలని ఏఐ ఏవైఎస్ జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో అంబేద్కర్ యువజన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1932 సెప్టెంబర్ 24న పూణ ఒప్పందాన్ని నిరసిస్తూ ఆ రోజును విద్రోమ దినంగా ప్రకటిస్తూ దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు.

రైతు నేస్తానికి రైతులు కరువు

కల్హేర్, సెప్టెంబర్ 24: రైతు నేస్తానికి ఆదరణ కరువైంది. ప్రభుత్వం ప్రతి మంగళవారం రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు ముఖాముఖి నిర్వహించి సాగు విధానం, పంటల దిగుబడి, సస్యరక్షణ చర్యలపై సలహాలు, సూచనలు అందిస్తారు. చాలామందికి రుణమాఫీ కాకపోవడంతో రైతులు బ్యాంకులు, వ్యవసాయ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. దీంతో రైతు నేస్తానికి దూరంగా ఉంటున్నారు. మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమానికి పట్టుమని పది మంది రైతులు కూడా హాజరు కాలేదు. కేవలం ఏఈవో సంతోష ముగ్గురు రైతులు మాత్రమే వీక్షించారు.

ఎంపీ రఘునందర్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న పలు పార్టీల నాయకులు

డంపింగ్ యార్డు పనులు నిలిపివేయాలి

గుమ్మడిదల, సెప్టెంబర్ 24: మండలంలోని నల్లవల్లి పంచాయతీ పరిధిలో జీహెచ్ఎంసీ ఏర్పాటు చేయనున్న డంపింగ్‌యార్డు పనులు వెంటనే నిలిపి వేయాలని మెదక్ ఎంపీకి వినతిపత్రం అందజేశారు. మంగళవారం మండల నాయకులు మెదక్ ఎంపీ రఘునందర్‌రావును కలిసి డంపింగ్ యార్డు ఏర్పాటుతో ఇక్కడి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతాయని వివరించారు. వ్యవసాయమే ప్రధానంగా జీవిస్తున్న రైతుల పరిస్థితి దారుణంగా తయారవుతుందన్నారు. డంపింగ్ యార్డుతో పచ్చని అడవి కలుషితం అవుతుందని, పంటలు సైతం సరిగా పండవని చెప్పారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, సూర్యనారాయణ, ఆకుల సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు శంకర్, హన్మంత్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు పలుగు గోవర్ధన్‌రెడ్డి, రాజిరెడ్డి, చెన్నంశెట్టి ఉదయ్‌కుమార్, అంజిరెడ్డి ఉన్నారు.

జిన్నారంలో భారీ వర్షం

జిన్నారం, సెప్టెంబర్ 24: మండలంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు వాన దంచికొట్టింది. ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు వచ్చాయి. చీకటి కమ్ముకొని ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం దాదాపు గంట పాటు కురిసింది. చెరువులు, కుంటల్లోకి నీరు చేరుకుంది. వానతో పంటలకు మంచి జరిగిందని రైతులు తెలిపారు. బొల్లారం, ఖాజీపల్లి, గడ్డపోతారం పారిశ్రామికవాడల్లో రసాయన వ్యర్థాలు వాన నీటిలో కలిసి ప్రవహించాయి. గడ్డపోతారంలోని పరిశ్రమల నుంచి అయ్యమ్మ చెరువు, జిల్లెల వాగు, ఖాజీపల్లి చెరువు, కుంటల్లోకి వ్యర్థాలు వచ్చి చేరాయి. బొల్లారంలోని అసాని కుంటలోకి వ్యర్థాలు భారీగా చేరుకున్నాయి.

జిల్లెల వాగు కాల్వలో వర్షం నీటిలో కలిసి ప్రవహిస్తున్న రసాయన వ్యర్థాలు

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

అందోల్, సెప్టెంబర్ 24: పరిసరాల శుభ్రతకు ప్రజలు పెద్దపీట వేయాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ కోరారు. మంగళవారం డీపీవో సాయిబాబాతో కలిసి మండల పరిధిలోని నేరడిగుంటలో పర్యటించి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓంటితోపాటు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్, ఎంపీవో అశోక్, పంచాయతీ కార్యదర్శి స్వామి, సోషల్‌వెల్ఫేర్ అధికారి నర్సింహులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలివ్వాలి

కంది బస్టాండ్ వద్ద దీక్ష చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

కంది, సెప్టెంబర్ 24: కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, నాన్ పర్మినెంట్ కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్లేశం డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్ చట్టపరమైన సౌకర్యాలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించి వేతనాలు పెంచకుంటే హైదరాబాద్ కమిషనరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం కంది బస్టాండ్ వద్ద దీక్ష చేపట్టి నిరసన తెలిపారు. దీక్షను ప్రారంభించిన మల్లేశం మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28న తలపెట్టిన ఛలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని 1710 పరిశ్రమల్లో 2లక్షల మంది కార్మికులు పని చేస్తుంటే ఇందులో లక్షా 60వేల మంది కార్మికులకు కనీస వేతనాలు, చట్టపరమైన సౌకర్యాలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు, నాయకులు బాగారెడ్డి, సురేశ్, మల్లేశ్, భీంరెడ్డి, ప్రవీణ్, సత్తయ్య, శివ, వెంకట్‌రెడ్డి, మహేశ్, ప్రకాష్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

జహీరాబాద్, సెప్టెంబర్ 24: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ సంగారెడ్డి అన్నారు. మంగళవారం జహీరాబాద్ పట్టణంలోని ప్రాంతీయ దవాఖానతోపాటు న్యాల్‌కల్ మండలం మిర్జాపూర్(బి)లోని సీహెచ్‌సీని సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్యంపై ఆరా తీశారు. పలు రికార్డులను పరిశీలించి వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. సమావేశంలో ఆయా దవాఖానలకు చెందిన సూపరింటెండెంట్లు డాక్టర్ శ్రీధర్, ప్రియాంక పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ సంగారెడ్డి

పొగాకు రహిత సమాజాన్ని నిర్మించాలి

సంగారెడ్డి, సెప్టెంబర్ 24: పొగాకు తాగడం ఆరోగ్యానికి హానికరమని, సమాజాన్ని పట్టిపీడిస్తున్న పొగాకు లేని సమాజాన్ని నిర్మించడానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని డీఎంహెచ్ఓ గాయత్రి దేవి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ దవాఖాన, బాలుర కళాశాల, పాత బస్టాండ్, ప్రధానమంత్రి స్కిల్ డెవలప్‌మెంట్‌లలో అవగాహన కల్పించారు. పొగాకు వినియోగంతో దేశంలో ఏడాదికి 1.35 మిలియన్ల మరణాలు సంభవిస్తున్నాయన్నారు. పొగాకు మానుకోలేని వారు 14416కు ఫోన్ చేస్తే కౌన్సెలింగ్ ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ కోఆర్డినేటర్ ముంతాజ్ అలీ, లక్ష్మి, విష్ణువర్ధన్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి పాల్గొన్నారు.



ప్రభుత్వ కళాశాలలో పొగాకుపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

అంగన్‌వాడీ కేంద్రాల సేవలపై ఆరా

మునిపల్లి, సెప్టెంబర్ 24: మండలంలోని చిన్న చెల్మడ, పెద్దచెల్మడ అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం వివిధ రాష్ట్రాల్లోని ఐసీడీఎస్ అధికారులు సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రం, బయట పరిస్థితులను పరిశీలించారు. చిన్నారులకు ఆట పాటలతోపాటు కథలు, రోజువారీ కార్యక్రమాలను పరిశీలించి చిన్నచెల్మడ అంగన్‌వాడీ కేంద్రం టీచర్‌ను అభినందించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో న్యూ సిలబస్ కరికులం కార్యక్రమాలను ఎలా ఉపయోగిస్తున్నారో తెలుసుకున్నారు. అంగన్‌వాడీ టీచర్లు మీనాక్షి, రేణక తదితరులు ఉన్నారు.

చిన్నచెల్మడ అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

శిక్షణ ఎస్‌ఐలు క్రమశిక్షణతో మెలగాలి

ఎస్పీ చెన్నూరి రూపేశ్

సంగారెడ్డి, సెప్టెంబర్ 24: జిల్లాకు కేటాయించిన పది మంది శిక్షణ ఎస్‌ఐలు క్రమశిక్షణతో ప్రజలతో సంబంధాలు కలిగి ఉండాలని, విధి నిర్వహణలో అంకితభావంతో పని చేయాలని ఎస్పీ చెన్నూరి రూపేశ్ సూచించారు. మంగళవారం పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో శిక్షణ ఎస్‌ఐలను జిల్లాకు కేటాయించారు. ఈ సందర్భంగా ఎస్పీ శిక్షణ ఎస్‌ఐలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలతో దురుసుగా మాట్లాడకూడదని, సమస్యను ఓపిగ్గా విని, వారిలో ధైర్యాన్ని నింపి తక్షణ పరిష్కారం దిశగా కృషి చేయాలన్నారు. సమాజ సేవకు పోలీసు శాఖ మరింత దగ్గరగా ఉంటుందన్నారు. శిక్షణలో భాగంగా వివిధ పోలీస్‌స్టేషన్‌లలో విధులు నిర్వహిస్తూ అన్ని రకాల విధులను తెలుసుకోవాలన్నారు. విధులు గురించి తెలిసినప్పుడే సిబ్బందితో విధులు చేయించగలమని, ప్రతి విధిని తెలుసుకోవాలన్నారు. విధి నిర్వహణలో ఎలాంటి అలసత్వం చూపినా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని శాఖలకు చెందిన అధికారులతో సత్సంబంధాలు కలిగి ఉండి, ప్రజల ధన, మాన ప్రాణ రక్షణతోపాటు శాంతిభద్రతల రక్షణలో ముందుండాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ సంజీవరావ్, అడ్మినిస్ట్రేషన్ అధికారి కల్యాణి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ విజయకృష్ణ, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ రమేశ్, కంట్రోల్ రూమ్ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రెడ్డి, నార్కోటిక్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, ఆర్ఐలు, శిక్షణ ఎస్ఐల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మట్లాడుతున్న ఎస్పీ చెన్నూరి రూపేశ్

బీఆర్ఎస్ నేతలకు పరామర్శ

గాంధీలో బీఆర్ఎస్ నేతను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్, సెప్టెంబర్ 24: అనారోగ్యంతో బాధపడుతూ దవాఖానలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ నేతలను ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పార్టీ నాయకులతో కలిసి పరామర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ నేతలు మాజీ ఎంపీటీసీ రాజేందర్‌రెడ్డి, పోతిరెడ్డిపల్లికి చెందిన నర్సింహులును పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలను అందించాలని వైద్యాధికారులను సూచించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ త్వరగా కోలుకుంటారని మనో ధైర్యాన్ని కలిగించారు.

తత్కాల్‌లో 'ఓపెన్' ఫీజు చెల్లించవచ్చు

సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 24: ఉమ్మడి మెదక్ జిల్లాలో ఓపెన్ స్కూల్ విధానంలో ప్రవేశం పొంది వచ్చే అక్టోబర్ నెలలో జరిగే పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల ఫీజును తత్కాల్ స్కీమ్ ద్వారా ఈ నెల 25, 26 తేదీలలో ఆన్‌లైన్ ద్వారా మాత్రమే చెల్లించాలని డీఈవో వెంకటేశ్వర్లు మంగళవారం ప్రకటనలో తెలిపారు. గతంలో అడ్మిషన్ పొంది పరీక్షలకు హాజరు కాని వారు, పరీక్షలకు హాజరై ఫెయిల్ అయిన వారు ఈ పరీక్షలు రాసేందుకు అర్హులన్నారు. వివరాలకు జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ 80084 03635 నంబరుపై సంప్రదించాలని సూచించారు.

ప్రజాభవన్‌లో వినతిపత్రాలు అందజేత

హత్నూర, సెప్టెంబర్ 24: ప్రభుత్వం ప్రతి మంగళవారం ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణిలో పలుసమస్యల పరిష్కారం కోరుతూ హత్నూర మండలం నస్తీపూర్ గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త వెంకట్‌రెడ్డి పలు వినతిపత్రాలు అందజేశారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన కంటివెలుగు మాదిరిగా మోకాళ్లనొప్పుల నివారణ కార్యక్రమం గ్రామగ్రామాన చేపట్టాలని, ఎలాంటి ఆంక్షలు లేకుండా పంట రుణాలు మాఫీ చేయాలని, నస్తీపూర్ గ్రామాన్ని సోలార్‌విలేజ్‌గా ఎంపికచేయాలని వినతిపత్రాల్లో ఆయన తెలిపారు. ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ చేసిందని ప్రకటనలు చేస్తున్నప్పటికి రాష్ట్రంలో ఎంతోమంది రైతులకు రుణమాఫీ కాలేదని, ప్రభుత్వం వెంటనే వారికి రుణమాఫీ చేయాలని కోరారు.

కొప్పు నర్సింహులుకు నివాళి

హత్నూర, సెప్టెంబర్ 24: సీనియర్ జర్నలిస్టు కొప్పు నర్సింహులు 8వ వర్ధంతిని పురస్కరించుకొని దౌల్తాబాద్‌లో మంగళవారం ప్రెస్‌క్లబ్ సభ్యులు, ప్రజాప్రతినిధులు ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ ప్రజాసమస్యలను భిన్నకోణంలో వార్తా కథనాలు రాసి ఎన్నో సమస్యల పరిష్కారానికి కృషిచేసిన నర్సింహులు ప్రజల గుండెల్లో నిలిచిపోతారని గుర్తుచేశారు. ప్రజల మనిషిగా పేరు సంపాదించుకున్న గొప్పవ్యక్తి అన్నారు.

పోలీసుల సేవలు భేష్

పటాన్‌చెరు, సెప్టెంబర్ 24: సేవల్లో పటాన్‌చెరు పోలీసులు భేష్ అని పలువురు మైనార్టీ నాయకులు కొనియాడారు. ఇటీవల నిర్వహించిన మిలాద్-ఉన్-నబీ జల్సా కార్యక్రమం, ర్యాలీ విజయవంతం చేయడంలో పోలీసుల సహకారాన్ని ప్రశంసిస్తూ మంగళవారం మిలాద్ కమిటీ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ ప్రవీణ్‌రెడ్డిని ఘనంగా సన్మానించింది. పోలీసుల సహకారంతోనే రెండు కార్యక్రమాలు విజయవంతం అయ్యాయన్నారు. పటాన్‌చెరు పట్టణం మత సామరస్యానికి కేంద్రం అని నిరూపించారని పోలీసులను మైనార్టీ నాయకులు అఫ్జల్, మెరాజ్‌ఖాన్ కొనియాడారు.



డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ ప్రవీణ్‌రెడ్డిని సన్మానిస్తున్న మైనార్టీ నేతలు

దేవాదాయ శాఖను రద్దు చేయాలి

తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆలయాల పరిరక్షణ సమితి సభ్యులు

కల్హేర్, సెప్టెంబర్ 24: దేవాదాయ శాఖను రద్దు చేసి ఆలయాల నిర్వహణ బాధ్యతను సాధుసంతులు, సనాతన ధర్మ పరిరక్షకులకు అప్పగించాలని హిందూ ఆలయాల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ శివ శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ హిందూ ఆలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న అన్య మతస్తులను తొలిగించాలని డిమాండ్ చేశారు. నూతన ఉద్యోగాల భర్తీలో అన్యమతస్తుల ప్రవేశాన్ని నిషేధించాలని కోరారు. హిందూ ఆలయాల ఆదాయాన్ని హిందూ ధార్మిక కార్యక్రమాలకు వినియోగించాలని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు మళ్లించొద్దన్నారు. దేవాదాయ శాఖ భూములను హిందువులకు మాత్రమే అద్దెకు ఇవ్వాలని కోరారు. గోహత్యలపై కఠిన చట్టాలను తీసుకువచ్చి గోమాతను కాపాడాలని కోరారు. తిరుమల తిరుపతి లడ్డూను అపవిత్రం చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో హిందూ ఆలయాల పరిరక్షణ సమితి సభ్యులు సాయి రాం, సంగమేశ్వర్ రావు, యెన్నం అనిల్‌రెడ్డి, రాజు, పండరి, కిష్టయ్య, రాములు, అరవింద్, సంతోష్, రాజాగౌడ్, నర్సింలు, భిక్షపతి, విఠల్, సాయెందర్, రామకృష్ణ, నరేందర్, రాజేశ్వర్, బాగయ్య, పరశురాం, సాయి రాం, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలోనూ ముందుండాలి

సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 24: విద్యతో పాటు సామాజిక సేవలో ముందుండాలని తారా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎస్ రత్నప్రసాద్ అన్నారు. మంగళవారం కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 1969 సెప్టెంబర్ 24న జాతీయ సేవా పథకం ప్రారంభించారని గుర్తు చేశారు. ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో యువతను కలిగిన ఏకైక స్వచ్ఛంద సేవా సంస్థ ఎన్ఎస్ఎస్ అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వకృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ సదయ్య కుమార్, డాక్టర్ వాణి, డాక్టర్ జోత్స్న, డాక్టర్ సుమతి, ఎన్‌సీసీ అధికారి డాక్టర్ విజయ పాల్గొన్నారు.

కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న తారా కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు

నేటి నుంచి వైజ్ఞానిక ప్రదర్శన

రామచంద్రాపురం, సెప్టెంబర్ 24: భారతీనగర్ డివిజన్‌లోని విద్యాభారతీ హైస్కూల్‌లో బుధవారం నుంచి రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తామని పాఠశాల అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ సరస్వతీ విద్యాపీఠం హైదరాబాద్ వారిచే మూడు రోజుల పాటు ఈ ప్రదర్శన ఉంటుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యాపీఠం పాఠశాలల నుంచి విద్యార్థులు సుమారు 500 మంది హాజరవుతున్నారని చెప్పారు. సుమారుగా 100కు పైగా ఎగ్జిబిట్స్‌ని ప్రదర్శించనున్నారని పేర్కొన్నారు. ఇందుకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ఈ వైజ్ఞానిక ప్రదర్శనకు కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే, కార్పొరేటర్లు ఇతర ప్రముఖులు హాజరవుతారని వెల్లడించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యక్షుడు అవధానులు, కార్యదర్శులు శ్రీనివాసరావు, గాల్‌రెడ్డి, సహకార్యదర్శి భూపాల్‌రెడ్డి, కోశాధికారి శ్రీనివాసులు, సభ్యులు సత్తయ్య, రాజానందం, భీమ్‌రావు, కృష్ణాగౌడ్, లక్ష్మణ్ ఉన్నారు.

అలరించిన సాయుధ రైతాంగ పోరాట నాటిక

జోగిపేటలో నాటిక ప్రదర్శిస్తున్న కళాకారులు

అందోల్, సెప్టెంబర్ 24: ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో మంగళవారం జోగిపేట క్లాక్‌టవర్ వద్ద కళాకారులు నిర్వహించిన సాయుధ రైతాంగ పోరాట నాటిక అలరించింది. అప్పటి దొరలకు ఎదురు నిలిచి పోరాడిన రైతుల గాథలను నాటిక రూపంలో కళాకారులు కండ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. భూమికోసం, భుక్తికోసం.. మాతృభూమి విముక్తికోసం ప్రాణాలు విడిచిన వీరులను తలుచుకుంటూ వారికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్ ఉన్నారు.

పంతుళ్లు లేక పరేషాన్

నాగల్‌గిద్ద, సెప్టెంబర్ 24: ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మండల పరిధిలోని కిషన్‌నాయక్ తండా పాఠశాలలో మంగళవారం విద్యార్థులు మధ్యాహ్నం వరకు ఉపాధ్యాయుల కోసం ఎదురు చూసి ఉపాధ్యాయురాలు రాకపోవడంతో ఇంటికి తిరిగి వెళ్లారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రుల ఉపాధ్యాయుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బడి బయట ఆడుకుంటున్న కిషన్‌నాయక్ తండా పాఠశాల విద్యార్థులు

పంటల రక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలి

జహీరాబాద్, సెప్టెంబర్ 24: పంటల రక్షణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని బసంతపూర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్, జహీరాబాద్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు భిక్షపతి అన్నారు. మంగళవారం మండలంలోని బూచినెల్లి, బుర్దీపాడ్ గ్రామాల్లో క్షేత్రస్థాయిలో కంది పంటలను పరిశీలించారు. వరద నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఏఈవో శ్రవంతి, ఆత్మ బీటీఎం చరణ్ పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

జహీరాబాద్, సెప్టెంబర్ 24: నీటి వసతులున్న వ్యవసాయ క్షేత్రాల్లో ఆయిల్ తోటలు సాగు చేస్తే రైతులకు అధిక లాభాలు వస్తాయని గోద్రెజ్ ఆగ్రివేట్ కంపెనీ జిల్లా మేనేజర్ హేమకొండల్‌రెడ్డి అన్నారు. ఉద్యానవన, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని హద్నూర్ రైతు వేదికలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్ పామ్ తోటలకు చీడపురుగులు సోకే అవకాశం తక్కువ ఉటుందన్నారు. పంట మార్కెటింగ్‌కు దిగులు చెందాల్సిన అవసరం లేదని, తమ కంపెనీయే కొనుగోలు చేస్తుందన్నారు. పంట దిగుబడి వచ్చే వరకు గోద్రెజ్ ఆగ్రోవేట్ కంపెనీ నియమించిన ఫిల్డ్ అసిస్టెంట్లు రైతులకు సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. సమావేశంలో కంపెనీ క్లస్టర్ ఇన్‌చార్జి రాజేశ్, ఫిల్డ్ ఆఫీసర్ గణేశ్, ఏఈవో సాయిలు ఉన్నారు.

వీరభద్రుడి ఆదాయం రూ.18లక్షలు

గుమ్మడిదల, సెప్టెంబర్ 24: ప్రసిద్ధ శైవ క్షేత్రమైన బొంతపల్లి భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో హుండీని లెక్కించారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ సూపరింటెండెంట్ శివరాజ్, ఎంపీడీవో ఉమాదేవి, ఈవో శశిధర్‌గుప్తా పర్యవేక్షణలో వేములవాడ రాజరాజేశ్వరీ దేవాలయానికి సంబంధించిన భక్తులు హుండీ ఆదాయాన్ని లెక్కించారు. మొత్తం రూ.18,23,572 వచ్చినట్లు తెలిపారు. అన్నదానం కోసం భక్తులు రూ.51,604 ఇచ్చినట్లు పేర్కొన్నారు. లెక్కింపులో జూనియర్ అసిస్టెంట్ సోమయ్య, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ వేణు, మాజీ ధర్మకర్తలు లక్ష్మీనారాయణ, భక్తులు ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

అదృశ్యమై.. చెరువులో శవమై

సిర్గాపూర్, సెప్టెంబర్ 24: ఇంటి నుంచి బయటకు వెళ్లిన మతిస్థిమితం లేని వ్యక్తి మంగళవారం చెరువులో శవమై తేలాడు. సిర్గాపూర్ పోలీసులు తెలిపిన వివరాలు.. సిర్గాపూర్‌కు చెందిన శేఖర్ మతి స్థిమితం కోల్పోయి మూడు రోజుల కింద ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీనిపై మిస్సింగ్ కేసు నమోదైంది. మంగళవారం సిర్గాపూర్ సాఖి చెరువులో మృతదేహం కనిపించడంతో దాన్ని పరీక్షించి శేఖర్‌గా గుర్తించారు. మృతదేహాన్ని వెలికితీసి పోస్టు మార్టం నిమిత్తం దవాఖానకు తరలించినట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

హామీలు నెరవేర్చాలి

సదాశివపేట, సెప్టెంబర్ 24: అసెంబ్లీ ఎన్నికల్లో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఉద్యమకారుడు నవాబు రాచిరెడ్డి డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు 250 చదరపు గజాల ఇంటి స్థలాన్ని కేటాయిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇంటి స్థలంతోపాటు ఇల్లు కట్టించి నెలకు రూ.25 వేల పింఛన్, హెల్త్‌కార్డులు, ఉద్యమకారుల పిల్లలకు ఉచిత విద్య, బస్సు ప్రయాణం, అంత్యోదయ కార్డులు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌గా శ్రీదేవి

బొల్లారం, సెప్టెంబర్ 24: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్‌గా శ్రీదేవి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వం ఇటీవల చేపట్టిన ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా చిన్న శంకరంపేట మండలంలోని ఆదర్శ పాఠశాల నుంచి బొల్లారం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌గా బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు.

PUBLIC NOTICE

This is to inform the general public that **MOHD INAYATH ALI** is acquiring H.No. 8-66, Plot No. 7, land admeasuring 220 Sq.yds., in Survey No. 325, situated at Kasal Village, Hathnoora Mandal, Sangareddy District from Md. Wahab Ali, Mohammea Aslamali, Mohammed Afsar Ali (who acquired the same vide Registered Partition Deed No. 681/2023, Dated 01-08-2023). The Original Link Document Registered Sale Deed No. 5929/2005, Dated 16-12-2005 is lost.

Whosoever has found the above mentioned Original Document and whoever has got any claims or rights over the above mentioned property. Please contact J.Sivanesan, Advocate, Contact No. 9393099915 within 10 days from date of publication of this notice.

బహిరంగ ప్రకటన

సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ శ్రీ **వడ్ల అశోక్** తండ్రి వడ్ల నారాయణ, వయస్సు 52 సంవత్సరాలు, వృత్తి: వ్యాపారం, నివాసం: ఇం.నెం.4-7-3/3/ఎ, కలబ్‌గూర్ గ్రామం, సంగారెడ్డి T&M, సంగారెడ్డి జిల్లా, టి.ఎస్. వారు తెలంగాణ, సంగారెడ్డి మున్సిపాలిటి పరిధిలోని బాలాజి నగర్, సంగారెడ్డి T,M &D వద్ద గల సర్వే నెం.208/1లో 130 చ.గజాలు విస్తీర్ణం, ఖాళీ ప్లాట్ నెం.7పై నిర్మించబడిన ఇంటి నెం.4-7-3/3/ఎ యొక్క అసలు యజమాని మరియు స్వాధీనదారు. నా క్లయింట్ సంగారెడ్డి టౌన్‌లో ప్రయాణిస్తుండగా 07 ఆగస్టు 1990 తేదీనాటి రిజిస్టర్డ్ సేల్ డీడ్ నెం.3045/1990 కలిగిన తన ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ పోయినది. ఎంత వెతికినను సదరు డాక్యుమెంట్ దొరకలేదు. అందువల్ల సదరు డాక్యుమెంట్ ఎవరికైనా దొరికినచో దిగువ సంతకం దారుకు తిరిగి అప్పగించవల్సిందిగా సాధారణ ప్రజలను ఇందుమూలంగా కోరడమైనది. ఎవరేని వ్యక్తి లేదా వ్యక్తులు పైన తెలిపిన సదరు ఆస్తికి సంబంధించి ఏదేని హక్కు, ప్రయోజనం లేదా ఏదేని అభ్యంతరం కలిగి ఉన్నచో ఈ ప్రచురణ తేదీనుండి 7 రోజులలోగా నన్ను సంప్రదించవచ్చును లేదా వారి అభ్యంతరాలను తెలుపవచ్చును, లేని యెడల ఆతరువాత ఎలాంటి క్లెయిలు అనుమతించబడవు. ఇందునిమిత్తమే ఈ బహిరంగ ప్రకటన జారీచేయబడినది.

సం/- బి. శ్రీనివాస్, అడ్వకేట్
ఎల్ఐసి ఆఫీస్ సమీపాన, అయ్యప్పనగర్,
సంగారెడ్డి టౌన్, సెల్: 9618458785

SUIT SUMMONS

In the Court of Hon'ble Junior Civil Judge, Zaheerabad Courts, Zaheerabad - T.S.
I.A. No. 190 of 2024
in
O.S.No. 115 of 2017

Sanjiv Kumar Mathur, S/o. Late A.K.Mathur, Age: About 63 years, Occu: Retired, R/o. 6-2-966/3, Hill Colony, Khairtabad, Hyderabad-500 004, T.S.
...Plaintiff

And

Srinivas, S/o. Bichanna, Aged about 45 years, Occu: Private Service/Agri., R/o. Ramthirath Village, Nyalkal Mandal, Sangareddy District, T.S.
...Respondent No. 6

Whereas the plaintiff has filed APPLICATION FOR DELETION OF FOUR (4) DEFENDANTS U/ORDER 1, RULE 10 (2) OF CPC against you in respect of the above suit and you are evading service of summons in the above suit addressed to you.

Therefore, please take notice of the summons in the above suit i.e., O.S.No. 115 of 2017 now stands posted to **03rd December, 2024 at 10.30 am** for your appearance in the above Court, in default thereof, the matter will be decided ex-parte.

//BY ORDER OF THE HON'BLE COURT ON 20th SEPTEMBER, 2024//

Sd/- RAJIV KUMAR, Advocate
6-2-966/3, Hill Colony, Khairtabad, Hyderabad-500 004 - TS,
Mob: 9346964999,
Email: rajivkumarmathur2003@yahoo.co.in